మిథ్యా బింబాలు

శ్రీ ఆర్. ఎం. చిదంబరం

రిజిష్టరు ఉత్తరం వచ్చేసరికి సహోధ్యాయులంతా కళ్ళు పెద్దవిచేసి చూస్తుంటే నవ్వుకున్నా—అది అప్పు దగ్గర్నుంచి వచ్చిందని అడ్రసు చూడకుండానే తెలుసుకున్నా. అతనూ, నేనూ చెన్నపట్నంలో చదువుకున్నాం. ఆ తరువాత ఏడెనిమిది సంవత్సరాలకు కలకత్తాలో కలుసుకున్నాం. రెండు సంవత్సరాలు గడిచాక మళ్ళీ విడిపోయాం. తరువాత చాలా కాలానికి అతని దగ్గర్నుంచి వచ్చిన రెండో ఉత్తరం యిది. అతనికి తెలుగు బాగా తెలుసు. అతన్తో మాట్లాడిన ఏ వ్యక్తికూడా అతను తెలుగువాడు కాడని అనలేరు. అంత స్పష్టంగా, చక్కగా అనర్గళంగా మాట్లాడతాడు. అప్పు తన జీవితకాలంలో చాలా చోట్లు తిరిగాడు. రకరకాల మనుష్యుల్ని కలుసుకున్నాడు. మనస్తత్వాన్ని పరిశీలించాడు. ఉత్తరం విప్పిచూస్తే నలభై పేజీల గ్రంథం వుంది. కుర్చీకి జేరబడి చదవ నారంభించాను.

*　　　*　　　*

డియర్ మూర్తీ,

ఈ వుత్తరం నీకు ఆశ్చర్యాన్ని కలిగించదు. కిందటి వుత్తరంలో నీకు నా అనుభవాలు కొన్ని వివరించాను—నీ దగ్గర్నుంచి ఏ విషయమూ దాచలేను. నీ కాలాన్ని కొంత వృథా చేస్తున్నందుకు బాధగా వుంది.

జీవితంలో ఆనందం, విషాదం, వైరాగ్యం వీటి ఆద్యంతాలు నిర్ణయించిన వారెవరూ లేరు. పాప రమ్మని బలవంతంచేస్తే సర్కసుకు వెళ్ళకతప్పిందికాదు. అడవిజంతువుల క్రూరత్వాన్ని వర్ణించి ఆ చిన్న గుండెలో భయాన్ని రేకెత్తించటానికి ప్రయత్నించి ఓడిపోయాను. సర్కసు మొదలైన గంటకు ఓ అమ్మాయి తీగమీద ఒంటి చక్రం సైకిలును చకచకా నడిపించుకుంటూ పోయింది. ఆమె ముఖాన్ని సరిగ్గా చూడలేకపోయినా గుర్తుపట్టాను. ఏదో ఆవేదన విద్యుచ్ఛక్తిలా శరీరంలో పాకింది. అవును...ఆమె దేవకి–అదే చిరునవ్వు–చేతుల మృదుత్వం–కళ్ళల్లో మెరుపులు.

'ఇంతవరకూ తనశక్తి సామర్థ్యాలతో మిమ్మల్ని ఆశ్చర్య పరచింది మిస్ ఫిలోమెనా' అని యెవరో ప్రకటించారు.

'కాదు..ఆమె దేవకి-ఇందులో పొరపాటుంది.' అనరిచాను. నా చుట్టూ వున్న జనం వింతగా చూశారు.

'తాతయ్యా! నీకు మతిపోయిందా ఏమిటి? ఎందుకలా అరుస్తావ్?' అంది పాప.

ఆ తరువాత నేను ఏమీ చూడలేకపోయాను. దేవకి వంగి నమస్కరించి వెళ్ళిపోయింది.

సర్కసు పూర్తయ్యాక బయటకు వస్తూ గేటు దగ్గర ఆగిపోయాను. జనం పల్చబడ్డారు.

నీలిరంగు కోటు - పెన్సిలు గీతలా సన్నటి మీసం - చక్కగా ఎగదువ్విన క్రాపు-

'మీరు...మీరు...' అని తడబడ్డాను.

అతను గౌరవ సూచకంగా నవ్వి 'నేను ఈ సర్కస్ కంపెనీ మేనేజర్ని - మీ కేమైనా సాయం చేయగలనా? సర్కసు బాగుందా?' అన్నాడు.

'కాదు...కాదు...మీ పేరు?...నీ పేరు?'

'నా పేరు మాలిక్' అన్నాడు.

'మాలిక్! నన్ను గుర్తు పట్టలేదూ? నేను డాక్టర్ అప్పుని- నీగురించి వివరాలు తెలుసుకుందుకు ఎంత ప్రయత్నించానో తెలుసా?...అది సరేకాని దేవకి పేరు 'ఫిలోమెనా' అని మార్చేశావేం?' ఆనందాతిరేకంలో అతని చేతులు రెండూ పట్టుకుని హృదయంలో పిచ్చి గీతల్లా సాగిపోతూన్న భావాలను చదువుదా మనుకుని అలాగే నిలబడిపోయాను.

'క్షమించండి - మీ రెవరో నాకు తెలియదు. మనిషిని పోలిన మనిషి వుండటం సహజం- నే నెవరి పేరూ మార్చలేను.'

అతని మాటలు అడవిలోంచి అల్లిబిల్లిగా సాగిపోతూన్న కాలిబాటను గుర్తుకుతెచ్చాయి. కాని వాదించి నిజానిజాలు తెలుసుకునేందుకు అధికారం, అవకాశం లేవు. నా వూహ సరైందని ఏదోశక్తి ఋజువుచేస్తోంది. బరువుగా కదిలాను. పాప మానవు

ముసుగు వేసుకుంది. అంటే కోపం శాఖోపశాఖలు వేస్తూం దన్నమాట! ఇల్లు చేరుకోగానే నాన్నతో ఫిర్యాదు చేసింది.

'నాన్నా! ఈ తాతయ్య పూర్తిగా పిచ్చివాడై పోతున్నాడు. అప్పుడప్పుడు నన్ను కొత్తపేర్లతో పలుస్తాడు. సరే, పోతే పోయిం దనుకున్నాను. ఇవేళ ఆ సర్కసులో ఓ అమ్మాయిని చూసి 'దేవకి' అనరిచాడు. ఆ సర్కసు మేనేజరును 'నువ్వు మాలిక్‌వి.' అన్నాడు. ఓ పొడుగాటి ఇంజక్ష నిచ్చేయ్!'

చిన్నగుండె! దావాగ్నిని అందులో దాచుకుని, అగ్నికణాలు లెక్కపెట్టే ఆత్మశక్తి ఎలా వస్తుంది?

మర్చిపోయిన దేవకి, మాలిక్‌లు మళ్ళీ ఎదురయ్యారు.

* * *

రంగూన్‌నుండి తిరిగివచ్చాక మళ్ళీ ఓ పల్లెటూరిలో డాక్టరుగా వెళ్ళాల్సి వచ్చింది. మొదట్లో ఆ వాతావరణాన్ని అసహ్యించుకున్నా, బలవంతంగా ప్రేమించటం తప్పించి గత్యంతరం కనపడలేదు. కొత్త మందులు కొన్ని కొనేందుకు చెన్నపట్నంలో ఓ వారం రోజులు మకాం వేశాను.

అప్పుడే కుటన్‌తో పరిచయం కలిగింది.

లావుగా, పొట్టిగా వున్న అతను గదిలో సామానంతా చిందర వందర చేసి ఆయాసంతో ఏనికోసమో వెతుకుతూంటే లోపల అడుగు పెట్టాను. అతను పోగొట్టుకున్న వస్తువు నా చేతిలో వుంది. కొంత సంభాషణ జరిగిన తరువాత అతని పర్సు తిరిగిచ్చాను. మేము మెట్లెక్కుతుంటే నా కంటబడటం అతని అదృష్ట మనాలి. అందులో రెండువేల రొక్కం, ఓ రాళ్ళ వుంగరం వున్నాయి. అంటే నా ఒక్కడికే 'నీతీ-నిజాయితీ' వుందని చెప్పుకోటం కాదు. ప్రతిమనిషి తనలోకంటె ఇతరులలో లోపా లెక్కువని నమ్ముతాడు. అది భ్రమని, తప్పని తెలిసినా కూడా బాహాటంగా ఒప్పుకోడు. నేనూ ఆ తరగతికి చెందినవాణ్ణే కనక ఆ పర్సు ఇతరుల చేతిలో పడివుంటే కుట్టన్‌కు తిరిగి దొరకదని స్థిరపర్చుకున్నాను. నన్ను 'హరిశ్చంద్రుడి' పక్కన నిలబెట్టి పొగిడాక తన్నుగురించి చెప్పాడు.

కుట్టన్ ఓ సర్కసు కంపెనీ మానేజరు. ప్రస్తుతం నే నంటున్న వూళ్ళోనే మకాం - వయసు యాభై పింవత్సరా లుంటాయి. కళ్ళకదలికల్ని బట్టి హృదయపు లోతు వూహించవచ్చు. మాటల తీరునుబట్టి శరీర దార్ఢ్యాన్ని తెలుసుకోవచ్చు. రహస్యాలకు దూరంగా వుండే కళ్ళు - చిన్న మీసం - సన్నటి నూలు పంచె - సిల్కు లాల్చీ - వేళ్ళకు రాళ్ళ వుంగరాలు - మెడలో చిన్న బంగారు గొలుసు - నుదుటిమీద చిన్న కుంకం బొట్టు - దూరంనుండి చూస్తే పట్టుదల-ముంగుకోపం-వెనక పశ్చాత్తాపం, అనురాగం, దయా-వున్న వ్యక్తిలా కనిపిస్తాడు. దగ్గరకు వెళ్ళి పరిశీలిస్తే తప్పిదంచేసి ఏదో దాచడానికి ప్రయత్నిస్తున్నవాడిలా కనిపిస్తాడు. ఒక వ్యక్తిరూపం మనం చూసే దూరంమీద ఆధారపడి వుండడంటే మాత్రం నేను ఒప్పుకోను. దూరానికి అందంగావున్న అమ్మాయిదగ్గరకు వెళ్ళిచూస్తే మరోలా కనిపించటంలేదూ? అతని సర్కస్ కంపెనీలో వంద మందికిపైగా సిబ్బంది వున్నారు. జంతువులు బోలెడు. రాబడి సుమారుగా వుంటుంది. వీళ్ళలో ఎవరో ఒకరికి జబ్బుచేస్తూనే వుంటుంది. ఏ మేకో, సింహమో కాళ్ళు బారచాపి 'ససేమిరా' లేవనంటుంది. వీళ్ళకు వైద్యం చేయటానికి ఓ డాక్టరు అవసరం. కుట్టన్ నా స్నేహితం ఎందుకు కోరుతున్నాడో అర్థమైంది. కుట్టన్ ఆ సాయంత్రమే వెళ్ళిపోయాడు.

* * *

చెన్నపట్నంనుండి తిరిగి వచ్చేసరికి సూర్యుడు ఆకాశంలో కొంత భాగాన్ని జయించి తన స్వాధీనం చేసుకుని, మిగిలిన భాగాన్ని కూడా తన వశం చేసుకోటానికి సిద్ధంగావున్నాడు. దూరంగా సర్కసు డేరం చుట్టూ రంగురంగుల విద్యుద్దీపాలు కనిపించాయి. వెలగకుండానే అంత అందంగా వున్నప్పుడు, కాంతికిరణాలు కళ్ళు తెరిస్తే సౌందర్యపరిమాణం ఎంత వుంటుందో మరి! చుట్టూ చిన్న చిన్న గుడారాలు, కంగారుగా అటూ ఇటూ పరుగెత్తే మనుష్యులు, ఓమూల ధ్యానముద్రలో వుండి, తొండాలు వూగిస్తూ, బయటి ప్రపంచపు కుళ్ళు, అసంతృప్తి, అహంకారం తమ చెవులకు సోకకూడదని తరిమివేస్తున్న ఏనుగులు, గొలుసులు తెంచుకుని స్వేచ్ఛకోసం పెనగులాడుతున్న కోతులు - గుడారానికి ఇరవై గజాల దూరంలో కుట్టన్ ఓ పెంకుటిల్లు అద్దెకు తీసుకున్నాడు. ఆప్యాయంతో కౌగలించుకుని స్వాగతం పలికాడు. నాయర్ కొట్టునుండి స్పెషలు టీ తెప్పించాడు. తన సర్కసుగురించి, స్వయంశక్తితో క్రమంగా మెట్లుకట్టి సౌధాగ్రం ఎలా చేరుకోగలిగిందీ వివరిస్తుంటే, చీకట్లోకి కాంతి కిరణాలు జారినట్లు

పకపక నవ్వులు వినిపించాయి. అందులో ఓ నవ్వు మాత్రం అలలుగా విడిపోయి, ప్రతి అంచూ ముత్యాల మీద నడిచేస్తూ. పడుతూ లేస్తూ తేలిపోయింది. ధ్వని తరంగాల్ని బట్టి ఆ అమ్మాయి అందచందాల్ని వూహించాను. సృష్టిరహస్యాన్ని శోధించి కనుక్కోమంటున్న కళ్ళు చిత్రంగా అటూ యిటూ కదులుతూ ఆకాశపుటెత్తుకు అనురాగాల్ని హృదయంలో రేకెత్తిస్తాయి. ఆ అనురాగస్వరూపాన్ని మాత్రం నిర్ణయించలేక పోయాను. అది మనసుచెప్పే చెడు మాటలు విని అపవిత్రం కావచ్చు. లేక ఆత్మప్రబోధం విని మంచికి ఆదర్శంగా వుండవచ్చు. రాగద్వేషాలతో అనుబంధం లేని పెదవులు. చేపల్ని పట్టేందుకు వలకు మల్లే నవ్వులు విసురుతుంటే చెక్కిళ్ళమీద చిన్న గుంటలు - కళ్ళల్లో కాంతి పొంగి పొర్లి ప్రవహించటంవలన బంగారురంగుపొందిన శరీరం - వెయ్యేండ్లు శ్రమపడి చెక్కిన శిల్పంలా కచ్చితమైన అవయవ నిర్మాణం. ఇలా ఆ అమ్మాయి రూపాన్ని సృష్టించుకున్నా. ఒక్క నవ్వు నాధారంచేసుకుని రూపకల్పన చేయటం వెర్రితనం కావచ్చు. కుట్టన్ తనకు చిన్నతనంలో లభించిన మెడల్సన్నీ చూపించాడు. దూరంగా సింహం గర్జించింది ఆకలితోనో - అసంతృప్తితోనో. 'రండి! సర్కసంతా తిరిగిచూద్దాం.' అంటూ కుట్టన్ కొరడాతీసి రెండుసార్లు ఝుళిపించాడు.

గుడారాన్ని సమీపిస్తుంటే అదే నవ్వు మళ్ళీ వినపడింది. లోపల అడుగుపెట్టాక ఆశ్చర్యపోయాను. నా వూహలో మెదిలిన ఆ రూపం సజీవమైంది.

'ఈమె దేవకి - నా ఒక్కగా నొక్క కూతురు - సర్కసుకంపెనీ కుడిభుజం. దేవకి లేకపోతే మేం ఒక్కరోజులో దివాలాతీస్తాం.' తరువాత నన్ను పరిచయం చేశాడు. దేవకి చిన్నపిల్లలకు 'పువ్వుల నృత్యం' నేర్పుతోంది. సరైనపద్ధతిలో, క్రమంలో ఆ నాట్యంచేస్తే ఓ పూలతోట కదులుతున్నట్టనిపిస్తుందని కుట్టన్ వివరించాడు.

'ఇతను రామన్ - బార్ మీద అన్ని పనులూ చేస్తాడు. ఒకనాడు దానికి మేనేజరైనా ఆశ్చర్య పడను.' రామన్ వినయంగా నవ్వాడు. అయిదడుగుల మనిషి - వజ్రశరీరం - మొహంమీద పడుతున్న జుత్తు - అతని ముఖంలో అమాయకత్వం పిచ్చిగీతలు గీసింది.

'ఇతను మాలిక్ - విగ్రహం చూస్తేనే అతని శక్తిసామర్థ్యాలు బోధపడతాయి. వెనకటికి గోవర్ధన గిరికి మల్లే సర్కసును ఓ వేలుమీద ఆడించగలడు. అతనికీ దేవకికి 'ఈడూ - జోడూ' సరిపోయిందంటే అతని రూపాన్ని మీరే వూహించుకోండి.'

కుట్టన్ ఆవేశంతో చెప్పుకుపోయాడు.

'నా గురించి మీరు తెలుసుకునే అవకాశాలు చాలా వున్నాయి. ఇదంతా నేను డబ్బుకోసం మొదలుపెట్టాను. అది నిజం. కాని క్రమేణా ఆసక్తి నశించింది. అప్పుడప్పుడు నష్టపోయేవాణ్ణి కూడా. చాలా మంది కంపెనీ అమ్మేయమన్నారు. ఒకరిద్దరు పెద్దమొత్తాలిస్తామంటూ ముందుకు వచ్చారు కూడా. నేను అమ్మలేకపోయాను. వీళ్ళలో ప్రతి ఒక్కరూ, నన్ను, నా మంచితనాన్ని నమ్ముకుని నమ్మకంగా పని చేశారు. మరొకరి చేతిలో ఎలా వుంటాను? ఈజంతువులన్నిటినీ నేనెంతగానో ప్రేమిస్తాను. మరొక యజమాని వస్తే వాటికి తిండిపెట్టక చంపుతాడేమో! ముసలితనం రావటంచేత ఎవరికైనా ఇచ్చేస్తాడేమో! స్వేచ్ఛను వదులుకుని ఇంతకాలం నాకు సేవ చేశాయి. వాటికి నేనిచ్చే ప్రతిఫలం ఇదేనా మరి?'

కుట్టన్ అందరికి మల్లే సామాన్యవ్యక్తి కాదనే నా వూహ నిజంలో అంతమైంది.

ఎవరో కంగారుగా ఉద్రేకానికీ, ఆశ్చర్యానికీ మధ్య పరుగెత్తుకొచ్చారు. 'కాత్యాయని ఏమీ తినటం లేదు. ఎంత చెప్పినా వినదు. అలా పడుకునుంది.' అన్నాడు.

కుట్టన్ నిప్పుతొక్కిన వాడిలా అడుగులు వేస్తూ 'పదండి-చూద్దాం' అంటూ కదిలాడు. ఈ కాత్యాయని దేవకికంటే అందంగా వుంటుందేమోనని వెంబడించాను. కుట్టన్ ఓ కొబ్బరిచెట్టు ముందర ఆగాడు.

'ఇదే మా కాత్యాయని - ఏమైంది నీకు? ఎందుకలా అలకపూనావ్?' అంటూ అక్కడ పడుకున్న ఏనుగుతొండం తడిమాడు. హఠాత్తుగా కాత్యాయని అతన్ని తొండంతో చుట్టివేసి కొమ్ముల దగ్గరకు లాక్కుంది. నేను గడగడలాడిపోయాను. సర్కసులో పనిచేస్తున్నవారంతా ఇలా దుర్మరణం పొందుతారని వినటమే కాని ప్రత్యక్షంగా ఎన్నడూ చూడలేదు. కుట్టన్‌ను విడిపించటం కూడా సాధ్యం కాదు. కాని కాత్యాయని అనుకున్న ఏ అగాయిత్యమూ చేయక అతనివంక దీనంగా చూసింది.

'ఏం ఇవేళ ముక్కాలిపీట మీద నిలబడటం నీకిష్టంలేదా? సరే - దానికేం విశ్రాంతి తీసుకో.'

అన్నాడు కుట్టన్ - ఏనుగు అతన్ని వదిలేసి సంతోషంతో ఘీంకరించింది.

నా ఒళ్ళు జలదరించింది. శ్రమపడి ఓ భాషంటూ సృష్టించి, దాన్ని సంస్కరించి, ఉపయోగిస్తున్నా అడుగడుక్కీ అపార్థాలు తీస్తున్నాం. ఏ భాషా అవసరంలేకుండా కాత్యాయని తన భావాన్ని ఎంత చక్కగా వ్యక్తపరిచింది! కుట్టన్ మానవ హృదయానికి మనసులో నమస్కారం పెట్టాను.

'చూశారా! ... ఇదే మరొకయజమానైతే ఈటెతో పొడిచి, బెత్తంతో కొట్టి నానా హింసపెట్టి తిండి తిప్పలులేకుండా కడుపు మాడ్చి దాన్ని వంగదీసేవాడు. అందుకే నేనీసర్కసుకు మరొకరకమ్మను.' నా కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

ఆ రాత్రి సర్కసంతా చూశాను. ముఖ్యంగా సన్నతీగమీద రంగురంగులగొడుగుతో విలాసంగా నడచిపోతున్న దేవకి ఓ దేవకన్యలా మెరసిపోయింది. ఏక్షణం ఆమె భూమ్మీదపడి అపవిత్రమైపోతుందో నన్నభయం చివరిదాకా నన్ను వదల్లేదు. అయిదారు బంతుల్ని ఒక్కసారి ఎగురవేస్తూ తన నైపుణ్యాన్ని ప్రదర్శించింది. అలాగే మగవాళ్ళనుకూడా ఆడించగలదు గామోలు! మాలిక్ ఎంతో ఎత్తున వుయ్యాలల మీద సునాయాసంగా ఎగిరిపడుతుంటే భయంతో కనురెప్పలు మూయలేకపోయాను.

వారం రోజుల్లో కుట్టన్, నేను ఆప్తమిత్రులమయ్యాం. తన స్వవిషయాలన్నీ దాపరికం లేకుండా నాకు చెప్పాడు.

* * *

రాత్రి పదకొండు—

పక్కవూళ్ళో ఓ 'సీరియస్ కేస్' చూశాక రెండెడ్లబండిమీద తిరిగివస్తున్నా. సర్కసు తాలూకు సంగీతం గాలిలో చెదిరిపోయి చెవుల దగ్గరకు చేరుతుంటోంది. బండివాడు పాడుతున్న జానపదగీతం వినటానికి ప్రకృతి నిశ్శబ్దంగా చెవులు నిక్కబొడుచుకుని మరింత దగ్గరగా వచ్చింది. అసలు, ప్రకృతి సౌందర్యం మానవుల కంటపడకుండా దాగివుంటుందిగామోలు నిష్కల్మష హృదయంతో ప్రార్థించిన భక్తుడికి తప్ప దైవం కనపడనట్టు! వెర్రి ఆవేశంతో శరీరాన్ని మరచి ఎండకు చలికి చలించక అన్వేషించే వ్యక్తులకు మాత్రమే ఆ సౌందర్యం కనిపిస్తుంది. చెట్లలోనూ, నక్షత్రాలలోనూ ఏముందనుకునే మనుష్యులంటే దానికి భయం. దూరంగా కనపడకుండా తెరవెనక దాగివుండి, తన్ను నిజంగా ప్రేమించేవారు కనపడగానే ఏ అర్ధరాత్రి పూటో తెర తొలగించి బయటికొస్తుంది. అలాంటి సౌందర్యాన్ని చూసి ముగ్ధుణ్నై పోయాను. బండి ఒక్క కుదుపుతో ఆగింది. ఎదురుగా మరో రెండెడ్లబండి నిలబడుంది. రస్తా వెడల్పు తక్కువ. బండివాళ్ళ మధ్య సంఘర్షణ మొదలైంది. తప్పొప్పులు నిర్ణయించటం ఎలాగూ సాధ్యంకాదు కనక, సంధి చేద్దామని బండి దిగాను. ఆ చీకట్లోనైనా సరే, అతన్ని గుర్తుపట్టాను.

'మాలిక్!' అన్నాను.

అతను ఆశ్చర్యపోతూ దగ్గరకువచ్చి 'నమస్కార' అన్నాడు. ముఖకళవళికలు సరిగ్గా కనపడకపోయినా, నిర్జనప్రదేశంలో, ఒంటరిగా, వేళకాని వేళ నిలబడుండటం అనేక సందేహాలను రేకెత్తించింది. సర్కసు రెండో ఆట జరుగుతున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.

'బండి అడ్డంగా ఎందుకుంచావ్? ఇది రస్తాని తెలియదూ?' అని గద్దించాడు బండివాడు. ఒకే వృత్తిలో వున్న ఇద్దరి మధ్యవుండే 'అసూయ' అతని కళ్ళల్లోంచి తప్పించుకోలేకపోయింది.

'ఏమండి బాబూ! ఎంతసేపిలా కాసుక్కూచోటం? తొమ్మిదింటికి వచ్చాం. ఇప్పుడు పన్నెండు కావస్తోంది.' రెండో బండివాడు మాలిక్ నడిగాడు. మాలిక్ చుక్కలు చూడసాగాడు. అతనెవరికోసమో నిరీక్షిస్తున్నట్లు స్పష్టమైంది.

'ఏమోయ్!... ఇదుగో నీ బాడుగ! తీసుకుని వెళ్ళిపో! నాకొంచెం పనుంది.' అన్నాను. మువ్వల చప్పుడు క్రమంగా దూరమై నిశీథంలో కలిసిపోయింది.

'మాలిక్! ఈ అర్ధరాత్రి ఏవిటిదంతా? నీ మనసు సరిగ్గాలేదు. అవునా?' అనడిగాను.

'మరేం లేదండి. త్వరగా చెన్నపట్నం వెళ్ళాలి. కుట్టన్ వెళ్ళమన్నాడు. అందుకని...' అని సాగదీశాడు. వస్తాదులా వున్న మాలిక్ గలివరు వూహాలో మెసలిన 'పొట్టిమనిషి'లా మాట్లాడటం ఆశ్చర్యాన్ని కలిగించింది.

'అదేవిటి? పొద్దున్న ఏడింటికి రైలు—ఇప్పట్నుంచీ ఎందుకు? అదీకాక తొమ్మిదింటికే వచ్చారంటున్నాడు బండివాడు. తిన్నగా వెళ్ళక మధ్య ఈ మజిలీ ఏమిటి?'

'అవును బాబు! స్టేషనుకుబండి కట్టాలన్నారు. మరొకరెవరో వస్తారట. అందుకని ఇక్కడ దాగి

పోయాం. ఆ రెండో మనిషి ఎంతకూ రాడు. నాబాడుగకూడా పోయింది. మాలిక్ మౌనంగా అతని కో రూపాయిచ్చి వెళ్ళమన్నాడు. ఇద్దరం ఏటి వొడ్డు చేరుకున్నాం. మాలిక్ గట్టుమీద కూర్చుని పిచ్చిగా గడ్డి మొక్కలు పీకిపారేస్తున్నాడు.

'మాలిక్! అసలువిషయం చెప్పు. నీలో నువ్వు మథనపడి లాభంలేదు. నావలన జరిగేవుపకారం ఏదైనా వుంటే చెప్పు—తప్పకుండా చేస్తాను.'

'మీతో చెప్పవలసిన అవసరం నాకెంతమాత్రం లేదు. జరిగినదంతా కుట్టన్‌తో చెప్పుకోండి నాకేం భయంలేదు.'

అలా అనటం కేవలం తన పిరికితనాన్ని సూచిస్తుందని మాలిక్ గమనించలేదు అతన్ని వంగదీసే తీరు ఇది కాదు.

'మంచిది. నాతోవన నేనుపోతా. కుట్టన్‌తో ఫిర్యాదుచేసే ఆవశ్యకత నాకేముంది? మానసికంగా నువ్వు క్రుంగిపోతున్నావని నాకు తెలుసు. మనిషిని చూసి మనిషి ఎంతకాలం భయపడగలడు? గౌరవం, ప్రేమ, ఆదరణ—ఇలాంటి భావాలకు తలవంచి కొంతకాలంవరకుమాత్రమే జీవించగలడు. ఏదో ఒకనాడు వీటన్నిటినీ ఛేదించవలసివుంటుంది.' దీపాల్లో సర్కసు గుడారం ఓ వెలుగు చక్రంలా కనపడింది. చప్పట్ల చప్పుడు దూరంగా వినిపిస్తోంది.

'దేవకి రంగంలోకి వచ్చినట్టుంది.! అన్నాను.

మాలిక్ పళ్లు పటపట కొరికాడు. దేవకిరాకకూ, అతని కోపానికీవున్న సంబంధం నాకర్థంకాలేదు.

హఠాత్తుగా నా చేతులు రెండూ పట్టుకుని 'క్షమించండి. నేను ఆవేశంతో మంచీ మర్యాద లేకుండా మాట్లాడాను. నా తెలివి తక్కువకు సిగ్గుపడుతున్నా.' అన్నాడు. తరువాత రెండునిమిషాలు మౌనం.

'డాక్టరుగారూ! ఎందుకో, మీతో నా ఆవేదన చెప్పుకోవాలనిపిస్తుంది. అసలు కథయిది. దేవకీ, నేనూ ప్రేమించుకున్నాం అది ఈనాడు హఠాత్తుగా జనించింది కాదు. ఈ కంపెనీలో అయిదేళ్ళక్రితం ప్రవేశించినప్పుడే ఆమెను ప్రేమించాను. ఒకటి రెండుసార్లు కుట్టన్‌తో పరోక్షంగా కదిపిచూశాను. మాట తప్పించివేశాడు. అతనీ పెళ్ళికి సమ్మతించడు. ఎందుకో, ఏమో నాకు తెలియదు. ఇలా ఎంతకాలం ఒకర్నొకరు చూసుకుంటూ తృప్తిపడటం? ఆ రకం అనుభూతి నాకక్కర్లేదు. మనం జీవించేది అనుభవాలకోసం. ఈ రాత్రి నాతో వచ్చేయటానికి దేవకి అతికష్టంమీద ఒప్పుకుంది. అన్ని ఏర్పాట్లూచేసి రెండుగంటలు ఎదురు చూశాను. మీరు రాకపోతే ఇంకా నిరీక్షించే వాడినేమో...! మోసపోయాను. ఆపదాన్ని విస్మరటం మగవాడి అసమర్థతల్లో ఒకటి.' అతను కోపంతో వణికిపోయాడు.

'దేవకి మోసగించిందని ఒప్పుకుంటా—కాని నిన్ను పూర్తిగా ప్రేమించికూడా ఎందుకురాలేదో ఆలోచించావా? బహుశా నీ వుద్రేకంలో ఈ ప్రశ్నకు చోటు దొరికివుండదు.'

సర్కసు బ్యాండు ఏదో హిందీపాటను పలికిస్తోంది.

'అందుకొక్కటే కారణం. తండ్రంటే ఆమెకు ప్రాణం. తన్ను పెంచి పెద్దచేసి ఈ విద్యంతా నేర్పాడు కనక అతని కోరికకు విరుద్ధంగా నడుచుకోరాదంటుంది. అక్కడే వచ్చింది చిక్కంతా.'

సర్కసు పూర్తై జనం బయటకు వస్తున్నారు. మాలిక్ కంగారుగా లేచి 'వస్తాను. తొందరగా వెళ్ళకపోతే దేవకిని కలుసుకోలేను.' అంటూ కదలిపోయాడు.

* * *

ఆ మర్నాడు తెల్లవారటమే తరువాయి.

దేవకికి వంట్లో బాగాలేదని, వెంటనే వచ్చి చూడవలసిందని కుట్టన్ కబురంపాడు. మెడికల్ ఛెస్టు తీసుకుని బయలుదేరాను. రకరకాల ఆలోచనలు వుదయిస్తూ మాయమవుతున్నాయి. నిన్నరాత్రి నమ్మించి మోసం చేయటం, జ్వరంవచ్చినట్టు నటించటం (నాకని ఎందుకనుకున్నానో మరి) ఇవన్నీ కేవలం కల్పితాలనిపించాయి. కుట్టన్ టెంటు పరిశీలించడానికి వెళ్ళాడు. కిటికీవారగా మంచంమీద పడుకుంది దేవకి. సౌందర్యం స్వాగతం చెప్పుకున్నట్టు పొడుగాటి కళ్ళ కదలికలు—చీర తాలూకు లేతగులాబీరంగు శరీరచ్ఛాయతో కలిసిపోయింది. ఉదయసూర్యుడి కిరణాలు బంగారురంగును రెట్టింపుచేశాయి. గుండెలవరకూ రగ్గు కప్పుకుంది. కుడి చేతికిమాత్రం రెండు గాజులున్నాయి. సర్కసుచేసేటప్పుడు తీసేస్తుందిగామోలు! అవును మరి. గాజుల గలగలలు నిశ్శబ్దంలో విని ఆనందించాలికాని బ్యాండు చేస్తున్న రణగొణధ్వనిలో కాదు. అలా పవ్వళించిన అందాన్ని చూసేసరికి వళ్ళు గగుర్పొడిచింది. కొద్దిగా భయం వేసింది కూడా. అడుగుల చప్పుడు విని నావైపు తిరిగి నమస్కరించింది. పొడుగాటి వేళ్లు కలుసుకునేసరికి స్వర్గానికి మెట్లు కడుతున్నట్టనిపించింది.

'ఏమిటి మీకు? ఒంట్లో ఏం బాధ?' అనడిగాను పక్కనేవున్న కుర్చీమీద కూర్చుంటూ.

'ఏమోనండీ! సరిగ్గా అర్థంకాదు. లేస్తే కళ్లు తిరుగుతున్నాయి. ఒక్కసారిగా బతుకుమీద వైరాగ్యం కలుగుతోంది.'

నాడి చూచాను. సర్కసుపిల్లకనక అభ్యంతరం చెప్పదని, ఏదో అపచారం (?) జరిగినట్టు భావించదని నాకు తెలుసు.

ఆమెకేరోగమూ లేదు. నిజం ఎక్కడ బయట పడుతుందోనని బెదురుచూపులు చూడటం నేను గమనించకపోలేదు.

'నువ్వు చెప్పేది శుద్ధ అబద్ధం! నీకు ఎలాంటి వ్యాధీ లేదు.' అన్నాను. మొదట్లో 'మీరు' అని, వెంటనే 'నువ్వు' అని సంబోధించటం నాకే ఆశ్చర్యాన్ని కలిగించింది.

దేవకి కనురెప్పలు నాలుగుసార్లు కదిపి వివరించనున్నట్టు చూసింది.

'అంటే, శారీరకంగా నీకేబాధా లేదు కాని మానసికంగా ఏదో వుంది.'

ఈసారి దాచుకున్న నవ్వు కొద్దిగా బయటకు జారింది.

'అబ్బో! మీకు వైద్యంతోపాటు జ్యోతిషం కూడా తెలుసన్నమాట!'

'అంతా నాకు తెలుసు. నువ్వు?...' అంటూ నవ్వేశాను. దేవకి కంగారుపడింది.

'ఏమిటది? చంపక చెప్పండి. మీ తప్పుడు అభిప్రాయాన్ని సరిదిద్దుతాను.'

'దేవకి!...నన్ను మభ్యపెట్టలేవు. కావాలిస్తే మాలిక్‌ను పిలుస్తాను.' ఆమె చనువుగా చేత్తో నా నోరుమూసింది. అందుకు కారణం వెంటనే తెలిసింది, కుట్టన్ గదిలో అడుగుపెట్టాడు.

'ఎలా వుంది? మరేం ప్రమాదం లేదుకదా? ఈనాటిదాకా అమ్మాయి మంచమెక్కి యెరగదు. నామట్టుకు నాకు ఆశ్చర్యంగా వుంది.' దేవకి పక్కుమంది.

'నాన్నగారికి మరీ భయం. ఏమీ లేదన్నా వినిపించుకోరు. నామీదుండే ప్రేమతో మరింత బాధపడుతున్నారు.'

'ప్రేమతో బాధపడటంలో మహత్తర సంతోషం వుంది' అన్నాను, ఎవరికి నచ్చినట్టు వాళ్ళను అర్థం చేసుకోమని. ఎవరో పిలిస్తే కుట్టన్ బయిటికివెళ్ళాడు.

నిన్నరాత్రి జరిగిన సంఘటన వివరించి దేవకి అభిప్రాయం తెలుసుకోవాలన్న కుతూహలం ఇనుమడించింది. సరైన సందర్భం దొరికిందంటూ సంభాషణ ఉపక్రమించేలోగా కుట్టన్ తిరిగివచ్చాడు.

'మరేం కంగారు పడక్కర్లేదు. మందు పంపిస్తాను. మానసిక శ్రమ. అంతే.'

'అంతే?' అనడిగాడు అర్థంకాని కంఠంలో.

'మరేంలేదు. ఒకేరకపు యాంత్రిక జీవితానికలవాటు పడటంవల్ల శరీరానికి, మెదడుకి మధ్య సహకారం తగ్గింది. మనిషి నీరసించిపోయింది. ఈ రెండింటికీ మధ్య స్నేహితం కుదిరేదాకా విశ్రాంతి తీసుకోనివ్వండి.' అన్నాను. కుట్టన్ అర్థం చేసుకున్నాడనుకోను. నేననుకోలేదీ అదే— 'మాలిక్‌ను పెళ్ళిచేసుకోవాలనే రోగం ఈమెను పట్టుకుంది.' అనెలా చెప్పగలను?

కుట్టన్ నామాట కాదనడు. దేవకి వారంరోజులపాటు సర్కసులో పాల్గొనదని ప్రకటించాడు. అతను నన్ను డిస్పెన్సరీదాకా సాగనంపాడు. నా ప్రశ్న తాత్కాలికంగా అలాగే నిలిచిపోయింది. ఆ రాత్రి పదకొండు.

గదితలుపు తాళంవేసి ప్రకృతిలోకొచ్చాను. దూరంగా ఓ సింహం గర్జిస్తోంది. మాలిక్ తనపని ముగించుకుని గది చేరుకునుంటాడు. చల్లగాలి ఎవర్నో వెదుక్కుంటూ పిచ్చిగీతం పాడుతూ వెళుతోంది. చందమామ 'నాకీ గగనం వద్ద'న్నట్టు పరుగెడుతున్నాడు. పొడుగాటి కొబ్బరిచెట్లు రహస్యం మాట్లాడుకుంటూ మధ్య మధ్య నిశ్శబ్దంగా నవ్వుకుంటున్నాయి. అలా నడుస్తూ ఏటివొడ్డు చేరుకున్నాను. అలా గట్టంట నడుస్తూ వెళ్ళి దాని జన్మస్థానం తెలుసుకోవాలన్న వెర్రివాంఛను అణచుకుని తన్మయత్వంలో మునిగిపోయాను. అలా ఎంతసేపు వూహాలోకంలో వున్నానో తెలియదు. అడుగులచప్పుడు, వంటిమీద మంచుబిందువులు పడ్డట్టు చిరునవ్వు తునకలు వినిపించేసరికి కాల్పనిక జగత్తుకు వీడ్కోలిచ్చాను. నవ్వునుబట్టి ఆ వచ్చే వ్యక్తుల్ని గుర్తించాను.

'మీ రిక్కడుంటారని నాకు తెలుసు. మాలిక్ నా మాట నమ్మలేదు.' అంది దేవకి. ఆమెనుచూసి అసూయతో గామోలు నక్షత్రాలు కళ్ళు చిట్లిస్తున్నాయి.

'అన్నివిధాలా నేను ఓడిపోయాను.' అన్నాడు మాలిక్.

'ఇప్పుడు చెప్పండి—నా మానసిక వ్యాధికి తగిన చికిత్స.' ఆ మాటలంటుంటే దేవకి కళ్ళ కదలికలు చూడాలని చీకట్లో వ్యర్థప్రయత్నం చేశాను.

'వెంటనే మాలిక్‌ను పెళ్ళిచేసుకో.' అన్నాను నవ్వుతూ.

'మిమ్మల్ని మీరు పూర్తిగా నమ్మవచ్చా?'

'మాలిక్! అది తెలివితక్కువ ప్రశ్న. ఏ మనిషినీ పూర్తిగా నమ్మలేం. మనసుకు ఓ స్థిరరూపం లేదు కనక—నన్ను పూర్తిగా విశ్వసించమన్నానంటే అందులో నిజాన్ని అనుమానించటానికి అవకాశంవుంది. కనక నీ ప్రశ్నకు నువ్వే జవాబు స్పష్టంచేసుకో.'

అతను అర్థమైనట్టు తలూపాడు.

'కుట్టన్ మా పెళ్ళి కొప్పుకోడు. మీరంటే అతనికి బోలెడు గౌరవం వుంది. మీ మాటెన్నడూ కాదనడు. మీరు కనక అతనికి తగినవిధంగా నచ్చచెబితే తప్పకుండా వింటాడు. తలచినపని నెరవేర్చే శక్తిసామర్థ్యాలు మీకున్నాయి.' కంఠంలో జాలి కరగిపోయింది.

'మాలిక్! ఈ సమస్యను మరింత సులువుగా పరిష్కరించవచ్చు. దేవకిని పెళ్ళిచేసుకుని మరో సర్కసుకంపెనీలో చేరిపో.'

మాలిక్ అడ్డుపడ్డాడు. చప్పున కాళ్ళదగ్గర్నుండి ఏదో పాకుతూ వెళ్ళింది.

'దేవకి ఒప్పుకోదు. నిన్నరాత్రి జరిగింది మీకు తెలుసుగా!'

'నాన్నను ధిక్కరించలేను. నేను లేకపోతే ఆయన జీవించలేడు. ఆ స్థితి వూహించండి. పిచ్చిగా అటూ యిటూ ఓ చేతికర్ర పుచ్చుకుని తిరుగుతూ మధ్య మధ్య నా ఫోటో ఎదురుగా వుంచుకొని ఏడుస్తాడు. వేళకు తిండితినడు. ఎవరూ అతనిమాట వినరు. అందరూ ఎదిరిస్తారు. కంపెనీ క్రమంగా దివాలా తీస్తుంది. అందరూ నాన్నను వేలెట్టి చూపించి 'ఫలానా దివాలాతీసిన సర్కసుకంపెనీ మేనేజరు' అంటారు. వద్దు. ఆ దురవస్థ ఎన్నటికీ వద్దు నా ప్రాణంపోయినా సరే నాన్నకాస్థితి వద్దు.'

దేవకి సన్నగా ఏడవటం మొదలుపెట్టింది.

'నేను చివరకు తెలుసుకున్నా. ప్రేమించటం పొరపాటు.'

'కాదు దేవకీ! అది నీ యిష్టాయిష్టాలమీద ఆధారపడుండదు. ప్రకృతి శాసనానికి ప్రేమ తలవంచి తీరుతుంది. అది సహజం.'

'సర్కసు పూర్తయినట్టుంది. దేవకి కనిపించకపోతే కుట్టన్ గాభరాపడతాడు. అంతా మీకే వదిలేస్తున్నా.' అన్నాడు మాలిక్ రెండడుగులు ముందుకు వేస్తూ.

ఆనాటి సంభాషణ ముగిసింది.

ఆరాత్రంతా ఆలోచించాను. ఈ బాధ్యతను నా నెత్తిన వేసుకోటం వెర్రితనం. ఈ సర్కసుకంపు ఇవేళుంటుంది. రేపు మాయమవుతుంది. దీనికోసం నేను తుఫానులో చిక్కుకోటం దేనికి?...మరుక్షణం ఎదురు దిక్కు నుండి ఆలోచనలు వీచాయి. ఇలా ఎంత కాలం జరుగుతుంది? ఓనాటి రాత్రి మనసు విరిగి మాలిక్ కుట్టన్‌ను బాకుతో పొడిచి చంపొచ్చు. లేక ప్రేమికులిద్దరూ ఏట్లోపడి ఆత్మహత్య చేసుకోవచ్చు. చరిత్రలో తార్కాణాలు బోలెడు. ఇది నియమబద్ధమైన సంస్కారాల మధ్య జరిగే సంఘర్షణ కాదు. అనురాగం-అసూయ-కట్టు-దాపరికం-గౌరవం-వీటన్నింటిని కరిగించి ఓ అజంతా శిల్పాన్ని తయారు చేయాలి ఎలా?......ఆ శిల్పం పూర్తయ్యేలోగా మాలిక్ ముసలితనాన్ని కౌగలించుకుంటాడు. కుట్టన్ మంచం వదలనంటాడు. దేవకి నెరసిన జుట్టును చక్కగా జడవేసుకుని ముడతలు పడిన ముఖాన్ని వందసార్లు అద్దంలో చూసుకుని సంతోషిస్తుంది. అలా జరగటానికి వీల్లేదు. కుట్టన్ ఈ పెళ్ళికి ఒప్పుకోకపోటానికి ఏదో బలమైన కారణం వుండేవుంటుంది. మాలిక్ సన్యాసిగానో. హంతకుడుగానో మారితే నేను బాధ్యుణ్ణేమో అనిపించింది. కుట్టన్‌తో ఈ సంగతి కదిలించి చూడాలని నిశ్చయించుకున్నా.

ఆ మర్నాడుదయం నేను వెళ్ళేసరికి కుట్టన్ కృష్ణుడి పటానికి హారతియిస్తున్నాడు. చప్పట్లు చరుస్తూ 'భేష్! భేష్...సర్కసు మనుష్యులకు దైవభక్తికూడా వుందన్నమాట!' అన్నాను.

కుట్టన్ హారతిపళ్ళెం నాముందుంచాడు. నుదుటిమీదున్న కుంకంబొట్టు ఉదయసూర్యుడిలా వెలిగింది. అతని ముఖంచూస్తే ఏమాత్రం కల్మషం వున్నవాడిలా కనపడలేదు.

'డాక్టరుగారూ! మీరన్నారు కనక చెబుతున్నా. దేవుడిమీద నమ్మకం లేనివారెవరూ లేరు. లేదని

రుజువుచేసే వాళ్ళ హృదయాల్లో కూడా బిక్కు బిక్కు మన్న భయం వుండేవుంటుంది. భక్తిని ప్రకటించేందుకు ఎన్నో మార్గాలు. అదీకాక నాబోటి వాళ్ళంతా హారతులివ్వకపోతే కర్పూర పరిశ్రమ ఎలా అభివృద్ధి చెందుతుంది?'

'చాలా గొప్పగా వుందండి. మరోసారి విపులంగా మనవిచేద్దురుగాని. దేవకి ఎలా వుంది?'

'అలాగే వుందండి. చిత్రం! పైకి ఏ రోగమూ వున్నట్టు కనిపించదు.' ఇదే సరైన సందర్భంగా కనపడింది.

'నాకు తెలుసు. ఆమె మానసికంగా బాధపడుతోంది.'

కుట్టన్ కళ్ళు పెద్దవిచేసి 'అంటే? నిన్న కూడా ఈమాటే అన్నారు. వివరంగా చెప్పండి.' అన్నాడు.

'అంటే అసంతృప్తి, జీవితంమీద విరక్తి, కోరికలు తీరనప్పుడు కలిగే అశాంతి. అందుకని త్వరగా పెళ్ళిచేసేయండి.'

కుట్టన్ పెద్దగా నవ్వాడు.

'నేనూ అంతే ననుకున్నాను. కాని దేవకి రామన్‌ను చేసుకోనంటోంది!' తెల్లబోయి తేరుకునే సరికి రెండు నిమిషాలు గడిచాయి.

'మిమ్మల్నొకమాట సూటిగా అడుగుతాను. ముసుగులో గుద్దులాటెందుకు?' కుట్టన్ పచార్లు చేస్తూ కోటుకున్న మెడల్సు లెక్క పెడుతున్నాడు.

'దేవకి మాలిక్‌ను ప్రేమిస్తోంది. అతనూ అంతే. ఇద్దరికీ పెళ్ళిచేయండి. మీ కంపెనీ పదింతలు గడిస్తుంది.'

హఠాత్తుగా కిటికీవూచ పట్టుకున్నాడు. అతని స్థూలశరీరం వణుకుతోంది. కళ్ళు కోపంతో ఎర్రబడి నుదుటిమీద బొట్టుతో పోటీపడ్డాయి.

'డాక్టరుగారూ! ఆవిషయం ఎత్తొద్దు. అది ఎన్నటికి జరిగేదికాదు. రోగం నయంకాకపోతే చావనివ్వండి.'

నేను లేచి నిలబడ్డాను.

'అతను పంజాబీయుడని మీరు వెనకాడుతున్నారా?'

'కాదు—కాదు—అలాంటి విభేదం నాకెన్నడూ లేదు. మనుష్యులందరూ ఒకటే. భాష, ఆచార వ్యవహారాలు, జీవితవిధానం, మారినంత మాత్రాన హృదయాలు మారవు.'

'అయితే మీ అభ్యంతరం ఏమిటి? కుట్టన్! ఆలోచించుకోండి. ఆమె నిష్క్రమణతో మీ కంపెనీ నిద్రిస్తుంది. అదలా వుంచి ప్రేమ ఓ మదించిన ఏరుకు- ఎదురీదలేని ప్రవాహం. దాన్ని మీరు కాదనలేరు. ఈ విషయంలో ఎలాగూ కల్పించుకున్నాను కనక దాని అంతు చూడటం మంచిది. నేను చేయగలిగిందేమీ లేదని మీరు పొరబడవచ్చు. వారిద్దరి మనసులు సక్రమంగా మీనుండి దూరంచేస్తాను. చెన్నపట్నంలో నాకు తెలిసిన సంస్థలు, పెద్దలు చాలామంది వున్నారు. మాలిక్‌ను ఎక్కడైనా చేర్పించి అతని జీవితవిధానం మార్చేస్తాను. తరువాత మీరు పశ్చాత్తాప పడతారు.'

అలా బెదిరించాలని మొదట్లో అనుకోలేదు. ఏదో వెర్రిఆవేశం నన్ను వశం చేసుకుని అర్థంలేని మాటలనిపించింది. దేవకిమనసు మార్చలేనని నాకు బాగా తెలుసు. నేను బయటకు వచ్చేస్తుంటే, కిటికీలోంచి బయటకు చూస్తూ నిలబడ్డ కుట్టన్ హఠాత్తుగా వచ్చి అడ్డంగా నిలబడ్డాడు. నాకొంచెం భయంవేసింది కూడా. ఎందుకంటే, మంచితనానికి, మూర్ఖత్వానికీ మధ్య పల్చటి తెరమాత్రం అడ్డు—అదెప్పుడు చిరుగుతుందో తెలియదు.

'డాక్టరుగారూ! మీకు నేనేం అపకారం చేశాను? ఎందుకు నన్నిలా వేధిస్తారు? మిమ్మల్ని గౌరవించి స్నేహితుడుగా నమ్మినందుకా?' అతను ఏడుస్తున్నాడేమో ననిపించింది.

'కుట్టన్! నేను నమ్మకద్రోహం చేయలేదు. మీరంటే నాకెంతో గౌరవం వుంది. కాని మీరు తప్పు త్రోవన వెడుతున్నారు. సరిదిద్దడానికోసం ఇలా ప్రవర్తించవలసి వచ్చింది.'

'పోనీ, ఆ రామన్‌ని చేసుకో కూడదూ?' అన్నాడు ఆశగా. చిన్నపిల్లాడు 'తాయిలం పెట్టవూ?' అన్నట్టుగా వుంది ఆ కోరిక!

'అదెలా కుదురుతుంది? పూలదండ దేవుడికి వేసినా, దయ్యానికి వేసినా ఒకటేనని మీరు వాదించినా, వేసేవాళ్ళకు తోచవద్దూ?'

'కాదు డాక్టరుగారూ! కాదు. అందుకు తగిన కారణంవుంది. ఎవరికీ చెప్పనని మాటివ్వండి. చెప్తాను.'

ఈమాటు ఆశ్చర్యపడటం నావంతు. ఈ సమస్య వెనక ఏదో రహస్యంవుందని మొదట్నుంచీ అనుమానిస్తూనే వున్నాను. అది నిజమైంది.

తిరిగివచ్చి కుర్చీలో కూర్చున్నా.

ఇంతలో రామన్ వచ్చి కుట్టన్‌ను ఎక్కడికో తీసుకుపోయాడు. పదినిమిషాల దాకా అతను తిరిగి రాలేదు. తలుపులు దగ్గరగా చేరవేసి కుట్టన్ పదేళ్ళ క్రితం జరిగిన సంఘటనలు వివరించాడు. అతని ప్రతి మాట నిజంమీద నడిచింది.

'ఈ కథంతా నాకు ముందే తెలియదు. మీనమ్మకాన్ని వదలుకోమనను. కాని ఈసంగతి దేవకితో ఎందుకు చెప్పలేదు? వెంటనే రామన్‌ను చేసుకునేదిగా!'

కుట్టన్ బరువుగా నిట్టూర్చాడు.

అక్కడే పొరపాటు చేశాను డాక్టరుగారూ! దానికి మంచిచెడ్డలు తెలిసే వయసురాగానే చెప్ప తలంచా. పెళ్ళిచేసుకుంటే ఎక్కడ నాకంపెనీ సరిగ్గా నడవదోనన్న స్వార్థంతో దాచివుంచాను. ఈలోగా మాలిక్ రావటం—ఈ ప్రేమగోల మొదలవటం జరిగింది. ఇప్పుడు దేవకితో ఈ విషయం చెప్తే తప్పకుండా ఆత్మహత్య చేసుకుంటుంది. మీకు తెలియదు. ఆమె మనసు పువ్వుకంటె సున్నితమైంది. దేవకంటే ప్రాణం దానికి. చెప్పండి. ఏం చెయటం?'

సర్కసు అమ్మాయిల పకపకలు, రిహార్సలు చేసుకుంటున్న బ్యాండు ధ్వని వినిపించాయి. అయిదు నిమిషాలు మౌనం రాజ్యం చేసింది. కుట్టన్‌ను ఎలా సమాధానపరచాలో నాకర్థంకాలేదు. అతని సమస్య, నమ్మకాలు, దానిచుట్టూ అతను నిర్మించుకున్న గోడలు ఇవన్నీ నిజానికీ, తర్కానికీ లొంగవు ఆగోడల్ని అతనే నేలమట్టం చేయాలి. మూర్ఖత్వానికి మందు లేదు.

'నాకే ఓ ఆలోచన తడుతూంది... ఈ మాలిక్‌ను పంపేస్తే సరి!' అన్నాడు వున్నట్టుండి.

'దేవకి అతనివెంట వెడుతుంది.'

కుట్టన్ పెద్దగా నవ్వాడు.

'పంపటమంటే ఎక్కడికనుకున్నారు? తిన్నగా పైకి.' అంటూ ఆకాశంకేసి చూశాడు. అతనిలో రాక్షసత్వం ప్రవేశించిందన్నమాట. పదినిమిషాల్లో అతని పశ్చాత్తాపం, బాధ అన్నీ మంటలో అంతమయ్యాయి. కుట్టన్ అనుకున్నంతపని చేయగలడు. మాలిక్‌కు తెలియకుండా విషం పెట్టొచ్చు, ఓసింహాన్ని మీదకు ఉరికించవచ్చు. ఎవరికైనా లంచం పెట్టి ఉయ్యాలమీదనుండి క్రిందకు తోయించవచ్చు. అనుకోవాలి కాని మార్గాలు బోలెడు 'కుట్టన్! ఆఖరుసారిగా చెప్తున్నా. మాలిక్‌కు ఏదైనా ప్రమాదం జరిగితే మిమ్మల్ని బోనులో నిలబెట్టిస్తాను జాగ్రత! కర్తవ్యాన్ని ఎన్నడూ మర్చిపోను.' జవాబుకోసం ఆశించకుండా బయటకు వచ్చేశాను.

తిన్నగా మాలిక్‌ను వెతుక్కుంటూ వెళ్ళాను. అతనెక్కడికో వెళ్ళాడని, మరో గంటదాకా తిరిగి రాడని తెలిసింది. అప్పట్లో ఆశాభంగం కలిగినా, నా తెలివితక్కువ వెంటనే అర్థమైంది. కుట్టన్ చెప్పిన రహస్యాన్ని అతనికి చెప్పటం ప్రమాదకరం. తెలిసినా అతనేం చెయలేడు. ఒక స్త్రీ కోసం తన భవిష్యత్తును తాకట్టు పెట్టాడు. దాన్ని విడిపించుకోటం వివేకం కలిగాక-ఆ వివేకం శక్తులు, యౌవనం, నశించాక-కాని కలుగదు. అప్పుడు ఆ స్త్రీ అతన్ని పరాయివాడిగా చూస్తుంది.

మాలిక్‌తో ఏ విషయమూ ప్రస్తావించ కూడదని నిర్ణయించుకున్నా. రెండు రోజులు గడిచాయి.

ఏం తోచక సర్కసు చూద్దామని వెళ్ళాను. దేవకి ఎలాగూ వుంటుందని తెలుసు. నన్ను చూడగానే బుకింగ్ దగ్గరున్న కుట్టన్ ఆశ్చర్యపోయాడు.

'ఇవేళ కొత్త ఫీట్లేమీ లేవు. చూసిందే చూడటం మీకు విసుగ్గా వుంటుందేమో!' అన్నాడు. ఈ మాటలు నన్ను ఆలోచనలోకి విసిరేశాయి. ప్రతిరోజూ సర్కసు చూడమని వేధించుకుతినే కుట్టన్ ఒక్కసారి, డొంకతిరుగుడుగా 'వచ్చిన దోవ చూసుకుంటే మంచిది.' అన్నాడంటే అందులో ముళ్ళూ, అడవులూ, క్రూరమృగాలూ వుండాలి.

సర్కసు మొదలైంది. కుట్టన్‌కోసం నాలుగు వేపులా చూశాను. అతని జాడెక్కడా లేదు. పంచరంగుల్లో అమ్మాయిలు కనిపించి, భూమ్మీద అడుగులు వేయక గాల్లో తేలిపోతున్నారు. మాలిక్ వచ్చేసరికి చప్పట్లు డేరాను చీల్చుకుపోయాయి. అతనంటే ప్రజలకెంత అభిమానం! బారుమీద మొగ్గలు వేసి మళ్ళీ కరతాళధ్వనులు తరుముతుంటే పారిపోయాడు. కుట్టన్ చెప్పినమాట నిజం—అంతా పాత—విసుగెత్తి వెళ్ళిపోదామని లేచి వచ్చిన జనాన్ని చూసి మళ్ళీ కూర్చున్నా.

ఆ తరువాత ఉయ్యాల లూగటం. మాలిక్ నిచ్చెనెక్కి ఉయ్యాల అందుకోటం—అది పుటుక్కున తెగటం—ఒక్కసారే జరిగాయి. హాహాకారాలు ఎదురెదురు బాణాల్లా దూసుకుపోయాయి. మాలిక్

ఎగిరి మరో వుయ్యాలందుకున్నాడు. ఆ రెండో వుయ్యాలల అందుకోని పక్షంలో అతన్ని గురించి ఆలోచించవలసిన అవసరం లేదు. మాలిక్ నెమ్మదిగా క్రిందకు దిగివచ్చాడు. డేరాబయట అతన్ని కలుసుకోగలిగాను.

'నాకే ఆశ్చర్యంగా వుంది. సాయంత్రం ఐదు గంటలకు వచ్చి చూశాను. అంతా సరిగ్గా వుంది. ఇది మృత్యువుతో చెలగాటం కనక ఎంతో జాగ్రత్తగా వుంటాను. తాడెవరో సగం కోసి వదిలేశారు.' మాలిక్ ఇంకేమీ చెప్పక గబగబ వెళ్ళిపోయాడు. అతన్తో ఎన్నో చెప్పాలనుకున్నా. అవకాశం జారింది. రుజువు లేదు కనక ఎవర్నీ ఏం చేయలేం—తిరిగి వస్తుంటే కుట్టన్ ఎదురుపడ్డాడు.

'చూశారా డాక్టరుగారూ! ఎంత ఘోరం జరిగిపోయింది! ఒక క్షణం ఆలస్యమైతే మాలిక్ మనకు దూరమైపోయేవాడు.'

'మీరు కోరుకున్నదేగా! మీ పన్నాగం పారనందుకు బాధపడుతున్నారా? ఈ నాడే కాదు. ఏనాడూ మీరు నిజాన్ని మోసగించలేరు. మన చర్యల్ని గమనిస్తూ నడిపిస్తున్నవాడొకడు పైన వున్నాడని మాత్రం మర్చిపోకండి. అతను కొంత కాలం వరకూ మన తప్పుల్ని క్షమిస్తాడు. కాని ఎల్ల కాలం కాదు.'

చరచర నడిచి వచ్చేశాను.

అలా కాకుండా, కుట్టన్ చెప్పే సమాధానం విని వుండాల్సిందేమో ననిపించింది. ఒక వేళ ఈ నాటకంలో అతనికి పాత్ర లేదేమో!...నా మొదటి నిర్ణయం నీటిమూటలా ఎంత అస్థిరమైందో అర్థమైంది.

కుట్టన్‌కూ నాకూ మధ్య ఈ నాలుగురోజుల్లో జరిగిన సంభాషణ—సంఘర్షణ మాలిక్‌కు వివరిద్దామని, మర్నాడుదయం బయలుదేరే సరికి టెలిగ్రాం ఎదురు వచ్చింది. ఆ రాత్రి ఒంటిగంటకు మెడికల్ ఆఫీసరు కుమార్తెకు వివాహం. వెంటనే రమ్మని దాని సారాంశం. వెళ్ళకపోతే అతను బాధపడటం సంగతలావుంచి నా జీవితానికి స్వరూపాన్ని ప్రసాదించి, నన్ను ఔన్నత్యానికి లేవనెత్తిన ఆయన ఆహ్వానాన్ని తృణీకరించటం తలపులో కూడా నల్లగీతలా కనపడింది. రైలు సరిగ్గా పదిగంటలకు—మరో ఆలోచనకు స్థానం లేదు. మాలిక్‌తో మాట్లాడేందుకవకాశం లేదు. తిరిగి వచ్చాక చూసుకుందామని తృప్తిపడి వెంటనే బయలుదేరాను.

* * *

రైలుదిగి డిస్పెన్సరీకి వస్తుంటే దేవకి ఎదురుపడింది. ఆమె నా కోసం నాలుగైదుసార్లు వచ్చిందట. చక్కటి చిత్రపటం గీసి వెంటనే సిరా ఒలకబోసినట్లు ఆమె రూపురేఖలు చెదరి వున్నాయి. కళ్ళు రెండూ భయంతో వణికాయి.

'డాక్టరుగారూ! కొంప మునిగింది! వెంటనే రండి' అంది. ఆమెను వివరాలడిగేందుకు వ్యవధి లేదు. అవకాశం లేదు. ఒక వేళ అడిగినా ఆ పరిస్థితుల్లో దేవకి నోరు మెదపలేదు. అంతులేని ఆవేదన ఆమె శరీరంలో ప్రతి అణువునూ అంటువ్యాధిలా పీడిస్తోంది. మెడికల్ ఛెస్టు తీసుకుని వెళ్ళేసరికి మాలిక్ పక్కమీదున్నాడు. కుట్టన్ కిటికీ దగ్గరున్నాడు.

'నిన్న ఈయనకు జ్వరం వచ్చిందండి. కుట్టన్ గారు మందిమ్మన్నారు. సరేనని మనం మామూలుగా ఇచ్చే మిక్చరు కలిపి ఇచ్చాను. తెల్లవారుజామున వాంతులు ప్రారంభమయ్యాయి.' అని వివరించాడు కంపౌండరు. మందు సీసా వంక చూస్తే ఇంకా రెండు పూట్లకు మందు మిగిలివుంది. అంటే మాలిక్ ఒకవంతు మాత్రమే తాగాడన్నమాట, మాలిక్ శరీరంలో విష పదార్థం ప్రవేశించిందని వెంటనే తేలిపోయింది. విరుగుడిచ్చి, పెద్దగా ఏడుస్తున్న దేవకిని ఓదార్చటానికి యత్నించాను.

'ఏం కంగారు పడొద్దు. మందు పంపిస్తాను, జాగ్రత్తగా చూసుకోండి. మరికొంచెం ఆలస్యమైతే మనకు దక్కేవాడు కాదు. ఎవరో ఇతన్ని విషం పెట్టి చంపటానికి ప్రయత్నించారు. దురదృష్టం కొలదీ బతికిపోయాడు. ఈ మందు తీసికెళ్ళి పూర్తిగా పరీక్షించి పోలీసుకు రిపోర్టిస్తాను.' అనేసి బయటకొచ్చాను. కంపౌండరు నన్ను వెంబడించాడు.

'నువ్వు చేసినపని నాకర్థమైంది. పిల్లి కళ్ళు మూసుకుంటే చీకటి పడుతుందనుకున్న వెర్రివాడా! డబ్బుకోసం కక్కుర్తిపడి ఈ పని చేశావు. తిన్నగా జైలుకు వెడతావు.' అని గద్దించానతన్ని.

'మీరు పొరబడుతున్నారు. నే నేపాపమూ ఎరుగను. నేను తతిమా గోళీల్ని గమనిస్తుంటే కుట్టన్ మందు సీసాలన్నీ పరిశీలించాడు. ఒక వేళ అతనే

కలిపివుంటాడు. కొన్ని సీసాలమీద మనం 'విషం' అని రాసివుంచాం- అదతనికి సాయపడింది. నేను హత్య కెన్నడూ తలపెటను. అలా బతికేదానికంటె నాలుగిళ్ళల్లో అడుక్కుని జీవిస్తాను. నాకూ హృదయమంటూ వుంది. నన్ను మాత్రం గంగలో ముంచకండి.' అని ప్రాధేయపడ్డాడు కంపౌండరు.

నేను ఆశ్చర్యపోయాను. కంపౌండరు ముఖంలో అమాయకత్వం వుంది. కుట్టన్ తెలివిగానే ప్రవర్తించాడు. నేను వూళ్ళోలేని సమయంలో చేయవలసింది చేసేసి నేరం కంపౌండరుమీద తోసేద్దామని ఎత్తువేశాడు. అతని అంతటి మంచితనం ఒక్కసారిగా స్వార్థంలో అంతమైంది. అనురాగం ద్వేషంలో అంతమైంది. విజ్ఞానం మూర్ఖత్వంలో కలిసింది. కొండకోనమీదవున్న మనిషిని అగాధంలోకి విసిరివేసేశక్తి పరిస్థితుల కుంది. నా కర్తవ్యంగురించి ఆలోచించాను. మాలిక్ ఎలాగూ జీవించాడుకనక ఎవర్నీ దండించనక్కర్లేదు. కాని కుట్టన్ మళ్ళీ వుపాయం వెతగ్గలడు. రేపు 'కాత్యాయని' చేత తొక్కిస్తే ఏం చేయటం? ఒక మనిషి తనకోసం బలిపోతే దాంట్లో అర్థంవుంది. మరొకరు సృష్టించే చీకట్లో చిక్కుకొని కన్నుమూయటం అసందర్భం. వెంటనే అధికారులకు తెలియజేయాలని నిర్ణయించుకున్నా. ఆ మధ్యాహ్నం పోలీసుస్టేషనుకు బయలుదేరుతుంటే దేవకి వచ్చింది. రెండు నిమిషాలు తీక్ష్ణంగా చూసింది.

'మాలిక్ ఎలా వున్నాడు?' అనడిగాను.

'బాగానే వున్నాడు మీదయవలన ... నేను మీదయకోసం వచ్చాను.'

'మందుతోబాటు దయకూడా సీసాల్లో వుంచాననుకుంటున్నావా?'

'కాదు. కాదు. మీ హృదయంలో వుంది...'

'నువ్వు చెప్పేది సూటిగా చెప్పు- నాకు పనుంది.' అంటూ హాండ్ బాగ్ అందుకున్నా. దేవకి చటుక్కున బాగ్ లాక్కుంది.

'ఆ పనేమిటో నాకు తెలుసు. డాక్టరుగారూ! నాన్నగారు వట్టి అమాయకులు- ఆయన కేమీ తెలియదు. దురదృష్టం కొలదీ ఈ చిక్కులు ఆయన్ని చుట్టుకున్నాయి. అంతేకాని మాలిక్‌ను చంపాలన్న కోరిక ఆయన కే కోశానా లేదు. నాకోసం - మా అందరి మంచికోసం మీరు జరిగినదంతా మర్చిపొండి.'

'దేవకీ! మాలిక్ మీద నీకుండే ప్రేమ నాకు తెలిసిపోయింది. ఇంక ఆ విషయం ప్రస్తావను. నేను వూహించిన విలువలు దానికిలేవు. కనుక నాకర్తవ్యాన్ని కోస్తాను. అదేమిటంటే నన్నూ, కంపౌండరునీ మోసగించి త్యాగాని కిచ్చిన మందులో విషంకలిపి హత్యకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని న్యాయస్థానంలో వుంచటం -అదే నాకర్తవ్యం. దీంట్లో జాలి, ప్రేమ, కోపం, నిరాశ ఏమీ లేవు. నావృత్తి గౌరవానికి సంబంధించినది. కుట్టన్‌ను నిర్దోషిగా రుజువు చేసేందుకు మీరందరూ కోర్టులో సాక్ష్యం ఇవ్వండి!'

ఈమాటలు నేను ఎటో చూస్తూ అనటంవల్ల దేవకిముఖంలో మార్పులు గమనించలేదు. ఏదో పెద్ద చప్పుడు. ఛటుక్కున తిరిగిచూశాను. ఓ క్షణం క్రితం వరకూ నిశ్చితరూపంలో కనిపించిన సీసా ముక్కలై మూలపదార్థంగా మారింది. దేవకి బాగ్ లోంచి మందు సీసాతీసి బయటకు విసిరేసింది. ఆమెకేసి కోపంగా చూశాను.

'డాక్టరుగారూ! క్షమించండి. నేను రెండు విధాలా చెడిపోయాను. నాకింక మనశ్శాంతి వుండదు.' అంటూ చేతుల్తో మొహం కప్పుకుని ఏడుపు సాగించింది.

'పోనీలే! జరిగిందేదో జరిగిపోయింది.'

అలా ఎలా అనగలిగానో నాకే ఆశ్చర్యంగా వుంది. నాకు తెలుసు. ఈనాడే కాదు. ఏనాడూ ఆమె కన్నీరు ఇంకిపోదు.

* * * *

ఆ మర్నాడు మాలిక్‌ను పరీక్షించటానికి వెళ్లినప్పుడు ఈ వారంరోజులుగా జరుగుతున్న సంఘటనలన్నీ వివరించాను. కుట్టన్ అతన్ని చంపటానికి యత్నిస్తున్నాడని కూడా రుజువుచేశాను. కాని అతను చెప్పిన రహస్యాన్ని మాత్రం దూరంగా వుంచాను. మాలిక్ హృదయంలో ఎలాంటి సంఘర్షణ లుదయిస్తాయో తెలియదుకాని. అతను మరింత పిచ్చివాడవుతాడని మాత్రం నిశ్చయించుకున్నా. పళ్ళుపటపట కొరికాడు.

'ఏదో ఒకనాడు నన్ను పైకిపంపిస్తాడని తెలుసు. ఈలోగా అతన్ని ముగిస్తే బాగుంటుంది. ప్రేమకు త్యాగం అవసరం. కాని మనం ఆ ప్రేమనుంచి కోరే ఆనందాన్నే త్యాగంచేయవలసివస్తే దాన్ని ద్వేషంగా మార్చటం మంచిది. నా కోరిక నెరవేరేందుకు వేరే మార్గాలు వెతుక్కోవాలన్నమాట.'

ఆ మాటలు నన్ను భయంలోకి విసిరేశాయి. అనురాగమైనా, ద్వేషమైనా అవధులు దాటితే ఓ మహా

ప్రవాహంలా పురకలు వేస్తూ పరుగు లెడుతూ ఎదురు పడ్డ శక్తుల్ని నిర్మూలిస్తాయి.

ఏమైనా, నా కర్తవ్యం పూర్తయింది.

వారం రోజులతరువాత ఆ సర్కసు కంపెనీ ఉత్తర దిశగా కదలిపోయింది. కుట్టన్, మాలిక్, దేవకి నన్ను కలుసుకుని నా ఔన్నత్యాన్ని మెచ్చుకున్నారు. ఎందుకో, ఏమిటో వాళ్లకూ తెలియదని నా నమ్మకం. దేవకి కళ్ళచివర నీటిముక్కలు, మాలిక్ కళ్ళల్లో ఎర్రదనం ఒక్కసారి కనిపించి మాయమయ్యాయి.

* * * *

నాకు తెలుసు. యావజ్జీవితమూ ఆ సర్కసుతో వుండలేనని, కాని ఉన్న కొద్దిరోజుల్లో ఆ ముగ్గురు వ్యక్తులూ హృదయానికి సన్నిహితంగా వచ్చారు. ఆ జ్ఞాపకాలుమాత్రం మిగిలాయి.

అన్నట్టు, కుట్టన్ చెప్పిన రహస్యాన్ని మీకు చెప్పనే లేదు. పదేళ్ళక్రితం, కుట్టన్ తల్లి దేవకి పెళ్ళి చూడాలని ప్రాధేయపడిందట. రామన్‌కూ, దేవకికీ పెళ్ళిజరిగింది. అప్పటికి దేవకి చిన్నపిల్ల. కుట్టన్ సర్కసుకంపెనీ స్థాపించలేదు. ప్రపంచయుద్ధం మొదలు కాగానే రామన్ యుద్ధంలో చేరాడు. యుద్ధం ముగిసే వరకూ అతని జాడే ఎవరికీ తెలియదు. చాలామంది అతను తిరిగిరాడనుకున్నారు. ఈలోగా కుట్టన్ సర్కస్ కంపెనీ మొదలు పెట్టాడు. దేవకి యౌవనంలో అడుగు పెట్టి వికసించింది. యుద్ధంనుండి రామన్ తిరిగివచ్చి సర్కసులో చేరాడు. కుట్టన్ అతన్ని గుర్తించాడు కాని రామన్ అంతా మర్చిపోయాడు. అతని జీవితక్రమమే మారి పోయింది. స్వార్థంకొద్దీ కుట్టన్ ఏమీ ఎరగనట్టు నటించాడు. ఇంతలో ఈ ప్రేమ తలెత్తి నవ్వింది అందుకే కుట్టన్ ఈ పెళ్ళికి సమ్మతించలేదు.

ఎందుకో ఈ కారణం కల్పితంకాదనిపించింది మనిషి ప్రవర్తననుబట్టి అతని మాటల్లో నిజానిజాలు గ్రహించవచ్చు. కుట్టన్ ఏవిషయంలోనూ అబద్ధం చెప్ప డనిపించింది. కాత్యాయనిమీద అతను చూపిన ప్రేమ ఎన్నటికీ మరపురాదు. ఆ జంతువులకు, మనుష్యులు ఋణపడివున్నట్టు భావించటం బహుశ అతని ఔన్నత్యానికి మెట్టుకదుతోందేమో! దైవభక్తి, ధాంవ సత్వం నీడల్లా వెంబడించాయి. ఎదురుగా భర్తవుండగా, దేవకిని పెళ్ళికాని పిల్లగా ప్రకటించి మరొకరికిచ్చి ఎలా పెళ్లి చేయగలడు? అవకాశందాటాక నిజం తెలుసుకున్నాడు.

దేవకి భవిష్యత్తుగురించి వూహించలేకపోయాను. ఎడారిలో గులాబీపువ్వులా ఆ వాతావరణంలో జీవిస్తూ ఓవంక మాలిక్‌నూ, మరోవంక తండ్రినీ ప్రేమిస్తూ కూర్చుంటుంది. మాలిక్ ప్రతిరోజూ ఆమెకోసం ఎదురు చూసి విసుగెత్తి, ఆనాటికి నిద్రపోయి మర్నాడు మళ్ళీ వస్తాడు. సర్కసుమనుష్యుల జీవితాలే చిత్రమైనవి. రాత్రి ప్రజలముందు తళుకుబెళుకులతో గగనంలో విహరించే దేవకన్యల్లా తళుక్కనమెరిసి మాయమవుతారు. యథార్థజీవితాలు వేరు. అశాంతి--అవమానం-- అసూయ - చీకటి—రేపు ఏం జరుగుతుందో తెలియని మిడిమిడిజ్ఞానం—ఇవన్నీ చేతులు కలుపుకుని చుట్టూ నాట్యంచేస్తూంటే అలసిసొలసి నిద్రపోయే ఆ మనుష్యుల జీవితక్రమాన్ను, మనస్తత్వాలనూ ఎన్నటికీ మర్చిపోలేను.

ఇంతకూ నాక్కలిగిన సందేహం ఇది. మాలిక్ సరైన సమయం చూసి కుట్టన్‌ను హత్యచేసివుంటాడు. దేవకి కొంతకాలం ఏడ్చి, ఏకాంతంలో పిచ్చిగా పాడుకుని, ఏటివొడ్డున మౌనంగా నిద్రపోయి, వర్తమానాన్ని గుర్తించి తిరిగి మాలిక్‌ను పెళ్లి చేసుకుని వుంటుంది. అందుకే, చాలా కాలం తరువాత నేనతన్ని గుర్తించినా అతనుమాత్రం నన్నెరగనట్లు 'మనుష్యుల్ని పోలిన మనుష్యులుంటార'ని చెప్పి తప్పించుకున్నాడు. కుట్టన్‌ను హత్యచేశాడని తెలిస్తే జైలుకువెళ్లవలసివస్తుందని భయపడివుంటాడు. కనుక అతనే మాలిక్ అయి వుంటాడని నమ్మకం. ఆ సర్కసులో మరెవరైనా అసలు నిజానిజాలు తేల్చుకుందామని నిర్ణయించుకునే సరికి వాళ్లంతా మరోవూరు వెళ్లిపోయారు. అసలు దేవకి మాలిక్‌ను పెళ్లి చేసుకుంటుందన్న నమ్మకం నాకు పూర్తిగా లేదు. ప్రేమకు. వివాహానికి మధ్యవున్న అంతరాన్ని ఆమె ఎలా వూహించుకుందో మరి! అందుకని దేవకిలాంటి మరో అమ్మాయిని చేసుకున్నాడేమో!... ఇలా అర్థంలేని సందేహాలు ఎన్నో వుదయిస్తున్నాయి. ఇదీ కథ—

అంతా చదివారు కనుక నా ప్రశ్నలకు జవాబు చెప్తారన్న ఆశతో ఎదురుచూస్తున్నా.

మీ ప్రియమైన

అప్పు.

అతనికి కలిగిన సందేహాలకు రెండింతలు నాక్కలిగాయి. గట్టిగా నిట్టూర్చటం తప్పించి సమాధానం వెదకలేక పోయాను. ఈ సందేహాలు అలాగే వుండిపోతాయేమోనన్న భయంతో ఈ కథంతా మీకు తెలియచేశాను. ఈ సమస్యను మీరు తప్పకుండా సాధిస్తారన్న నమ్మకం నాకుంది.